ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

◆ జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర
◆ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాల్లో చర్చకు పలు అంశాలు



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర అధికారులకు సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సంక్షేమ ఫలం వారికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ప్రజా పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చ జరిగింది. సమావేశాల్లో భాగంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ముందుగా చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు సంధించగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలను తెలియజేశారు.

ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతికి కృషి చేయాలని, మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లోనూ మహిళా మార్టులను ప్రారంభించాలని డిఆర్‌డిఎ పీడీకి సూచించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ అనుబంధ రంగాలకు మిగతా 2లో..

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయండి

- సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు



ఉపాధి హామీ పనులకు సంబంధించి తక్షణం బకాయిలు విడుదల చేయాలని సిపిఎం అనంతగిరి జెడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు కోరారు. 2వ స్థాయీ సంఘ సమావేశంలో గ్రామీణ అభివృద్ధిపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. మండలాల్లో డిఆర్‌డిఎ ద్వారా ప్రజలకు అందే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు నిధుల విడుదల, ఐకెపి బ్యాంకు లింకేజ్ లోన్ల మంజూరు విషయంలో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వటం లేదని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జరిగిన పనులకు రెండు వారాలు మాత్రమే పేమెంట్‌లు జమయ్యాయని, నేటికీ బకాయిలు మిగతా 2లో..



అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు 4వ స్థానం

జాతీయ స్థాయిలో పరిశుభ్ర నగరంగా పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజల సహకారం, పారిశుధ్య కార్మికుల నిరంతర కృషి ఫలితంగా జాతీయ స్థాయిలో పరిశుభ్ర నగరంగా విశాఖకు గుర్తింపు దక్కింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ మహా నగరం నాలుగో స్థానాన్ని కైవశం చేసుకుంది. ఈ మేరకు పురస్కారాన్ని గురువారం ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా జివిఎంసి స్వీకరించింది. ఈ అత్యుత్తమ పురస్కార గౌరవాన్ని నగర ప్రజలకు అంకితం చేస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ గురువారం ఢిల్లీ నుంచి పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. ప్రతి ఏటా పరిశుభ్ర నగరాల్లో విశాఖ ప్రగతి దిశగానే సాగుతోందన్నారు. సింగిల్ డిజిట్ పరిశుభ్ర నగర స్థాయిని పొందుతూనే వుందన్నారు. 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కూడా స్వచ్ఛ భారత్ మిషన్ రూపొందించిన సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్ (4830 మార్కులకు), సర్టిఫికేషన్ (2500 మార్కులకు), సిటిజెన్ వాయిస్ (2170 మార్కులకు) అంశాలకు సంబంధించి 9500 మార్కులకుగానూ విశాఖపట్నం 8879.25 మార్కులు దక్కించుకుంది. 4477 నగరాల మధ్య పోటీలో ఒక లక్ష కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల జాబితాలో మిగతా 2లో..

గుంటూరు వరకూ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సేవలు

▶ వార్త 2లో..

విశాఖలో మరికొన్ని కోవిడ్ కేసులు

▶ వార్త 2లో..

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ

▶ వార్త 2లో..



సబ్బవరంలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

31వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. నెలరోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడంతో అంగన్‌వాడీలు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఎక్కడికక్కడ మండిపడ్డారు. పలుచోట్ల ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలిపారు. పొర్లు దండాలు పెట్టి వేడుకున్నారు. డిమాండ్లను నెరవేర్చే వరకూ సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

(వార్తలు 8లో..)

'అప్పన్న' పేరిట భూ దందా!

ఎపి హౌసింగ్ బోర్డుకు రైతుల భూమి అమ్మేసిన సింహాచల దేవస్థానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇళ్ల స్థలాలు, జీవనోపాధి కోసం గతంలో ప్రజలు కొనుక్కున్న భూములపై సింహాచలం దేవస్థానం నేటికీ పెత్తనం చెలాయిస్తూనే ఉంది. దీంతో ఏళ్లతరబడి సామాన్య రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులు, పేదల భూములను అక్రమంగా ఎపి హౌసింగ్ బోర్డు సంస్థకు అమ్మేయడంతో వారంతా లబోదిబోమంటున్నారు. ఈ తరహా భూ దందాలతో రియల్టర్ మాదిరిగా 'దేవస్థానం' వ్యవహరించడంపై 1990వ దశకం నుంచీ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పాలకులకు పట్టడం లేదు. పంచ గ్రామాల సమస్య నేటికీ పరిష్కరింపబడలేదు. 1994 నుంచీ భూ దందాలు నడుస్తుండడంతో సామాన్య, మధ్య తరగతి రైతులకు శ్రీ వరహాలక్ష్మీ నృసింహ దేవస్థానంతో పోరాటం తప్పడం లేదు.



సంబంధిత స్థలమిదే.. (ఫైల్‌ఫొటో)

భూ అక్రమం సాగిందిలా...

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు (ఎపిహెచ్‌బి)కి 50 ఎకరాలను జీవో ప్రకారం దేవస్థానం గతంలో అమ్మేసింది. అయితే ఇది చెల్లుబాటు కాదబి హౌసింగ్ సొసైటీ సభ్యులు 120 మంది గగ్గోలుపెడుతున్నారు. శ్రీ వరహా లక్ష్మీ నృసింహ ప్రశాంతినగర్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

'అప్పన్న' పేరిట భూ దందా!

భూమిలో సగానికి పైగా ఎపి హౌసింగ్ బోర్డుకు అక్రమంగా దేవస్థానం ఇచ్చేసింది. వేపగుంట సర్వే నెంబరు 3బిలో ఎకరా 50 సెంట్లు, సర్వే నెంబరు 3సిలోని 3 ఎకరాలా 94 సెంట్లు, సర్వే నెంబరు 4లో 4 ఎకరాలా 58 సెంట్లు మొత్తం భూమి 10 ఎకరాలా 2 సెంట్లు సొసైటీది కాగా ఈ మొత్తం భూమిలోగల సర్వే నెంబరు 3బిలో ఎకరా 50 సెంట్లు, సర్వే నెంబరు 3సిలో 3 ఎకరాలా 94 సెంట్లు, సర్వే నెంబరు 4లో 99 సెంట్లు మొత్తంగా 6.33 ఎకరాల సొసైటీ భూమిని సింహాచలం దేవస్థానం ఎపి హౌసింగ్ బోర్డుకు అక్రమంగా స్వాధీనం చేసింది. దీంతో కోర్టుల చుట్టూ బాధిత సొసైటీ సభ్యులు ఏళ్లతరబడి తిరుగుతున్నారు.

రెవెన్యూ వ్యవహారంతో సొసైటీకి తీవ్ర అన్యాయం

హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు లోచర్ల రమణాజీ గడిచిన సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా కలెక్టర్‌కు భూ సమస్యపైనా, దేవస్థానం చేసిన అన్యాయంపైనా ఫిర్యాదు చేశారు. 1994లో 11 ఎకరాలను 120 మంది సభ్యులం కొనుగోలు చేశామని ఆయన 'ప్రజాశక్తి'కి వివరిస్తూ.. ఆ తర్వాత రెండేళ్లకు అంటే 1996లో అప్పటి ప్రభుత్వం ప్రోద్బలంతో పెందుర్తి తహశీల్దారు అక్రమంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారన్నారు. సింహాచలం దేవస్థానం వారికి రైత్వారీ పట్టా జారీ చేయడంతో తమకు హక్కుగల భూమిని కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఇప్పటికే తాము జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నట్టు తెలిపారు. తక్షణం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కలుగజేసుకుని తమ భూమిని అప్పగించాలని కోరుతున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు 4వ స్థానం

జాతీయ స్థాయిలో నాలుగో పరిశుభ్ర నగర స్థాయి పురస్కారాన్ని అందుకుంది. విశాఖ నగరాన్ని పరిశుభ్ర, పర్యావరణహిత, చెత్త రహిత, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడంలో సహకరించిన అందరికీ మేయర్, కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2024లో కూడా మొదటి మూడు స్థానాలలో నిలిచేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత

అధిక ప్రాధాన్యత ఇస్తూ పూడిక తొలగింపు, కాలువల శుభ్రత చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజా పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేయాలని, పండ్ల తోటల పెంపకానికి తగిన ప్రోత్సాహం అందించాలని అన్నారు. యువత ఉపాధికి అవకాశ మార్గాలను అన్వేషించాలని, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో కింది స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకురాగా విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్‌పి సిఇఒకు సూచించారు. బెల్టు షాపులు పెరిగిపోతున్నాయని, దృష్టి సారించాలని సభ్యులు కోరగా సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ ఆదేశించారు. మినీ గోకులాలకు సంబంధించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వాటి ప్రయోజనాలు అందుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వారంలోపే పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు తెలిపారు. నిధులు సరిపడా ఉన్నాయని, ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని, ప్రారంభ, మధ్యస్థ పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా కూడా బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన చెప్పారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయండి

అందలేదని తెలిపారు. అనంతగిరి మండలంలో రూ.2 కోట్లు 40 లక్షల బకాయిలు ఉన్నాయని, మెటీరియల్ పేమెంట్‌కి సంబంధించి రూ.కోటీ 45 లక్షల బకాయిలు అందలేదని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాలకు రావాల్సిన రూ.24 కోట్లు బకాయిలను తక్షణం విడుదల చేయాలన్నారు.

సుప్రీం తీర్పు చారిత్రాత్మకం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్ష కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్ట విరుద్ధమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆవాజ్ కమిటీ స్వాగతించింది. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ ఆయుబ్, అబ్దుల్ అహద్ ఆశ్రఫ్ మాట్లాడుతూ బిల్కిస్ బానో కేసు వివరాలను వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ



ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా వైసిపి నాయకులు కొండా రాజీవ్ గాంధీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ సంస్థ ఛైర్మన్‌గా కొండా రాజీవ్ సోదరి కొండా రమాదేవి వున్నారు. ఆమె పదవీ కాలం ముగియడంతో ఈసారి ఛైర్మన్‌గా రాజీవ్ గాంధీని నియమించారు. విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన రాజీవ్ గాంధీ వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఉన్నారు.

ప్రభుత్వం మెడలు వంచిన మున్సిపల్ కార్మికులు

పోరాడి విజయం సాధించిన వారికి అభినందనలు
విశాఖ సభలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ 16 రోజులపాటు సమ్మె చేసి ప్రభుత్వ మెడలు వంచారని, బేసిక్ పే రూ.21 వేలు జీతాన్ని సాధించుకోవడం ఘన విజయమని సిపిఎం 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. వీరోచితంగా పోరాడిన మున్సిపల్ కార్మికులకు అభినందనలు తెలిపారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ కార్మికుల అభినందన సభ జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య వక్తగా పాల్గొన్న గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీ స్కిల్ వేతనాలు చెల్లించాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ సమ్మె జరిగిందన్నారు. 'జీతాలు పెంచలేం, సమ్మె విరమించకపోతే ఉక్కు పాదంతో ఉద్యమాన్ని అణిచివేస్తాం' అన్న ప్రభుత్వ తుదకు పోరాటాలకు తలొగ్గాల్సి వచ్చిందని అన్నారు. యుజిడి, మలేరియా, ఎంఎస్ఎఫ్ డ్రైవర్లకు, క్లీనర్లకు హెల్త్ అలవెన్సు ఇస్తామని ఒప్పుకుందన్నారు. రూ.15 వేల జీతాన్ని రూ.24,500కు పెంచకపోవడం జరిగిందన్నారు. పారిశుధ్య కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద బీమా, ఇన్సూరెన్స్, 12వ పిఆర్‌సి బేసిక్ పే ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చిందన్నారు. వాటర్ సప్లై, పార్కులు, ఇతర ఇంజినీరింగ్ సెక్షన్‌లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వమే స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేసి, స్కిల్, సెమీ స్కిల్ వేతనాలు చెల్లిస్తామని చెప్పిందన్నారు. తొమ్మిది మంది అధికారులతో కమిటీ వేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లించే విధంగా కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారన్నారు. కుక్కలు, పాములు, పందుల నుండి ప్రజలను రక్షిస్తున్న వెటర్నరీ డిపార్ట్మెంట్ కార్మికులను పబ్లిక్ హెల్త్‌లో కలిపే విధంగా త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. సమ్మె కాలానికి జీతాలు చెల్లిస్తామని, పారిశుధ్య కార్మికులకు పండగ బోనస్ వెయ్యి రూపాయలు చెల్లిస్తామని ప్రకటించారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పినట్లయితే ఫిబ్రవరి 1 నుండి సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. సంఘం అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ తమకు అండగా నిలిచిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ అధ్యక్షులు పి.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ సమ్మెలో సిఐటియు కీలక పాత్ర పోషించినప్పటికీ ప్రభుత్వానికి తొత్తుగా ఉన్న 18 సంఘాలను చర్చలకు పిలవడాన్ని తీవ్రంగా ఖండించారు.

ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్ల పరిష్కారం కాకపోవడానికి విశాఖలోని వైఎస్ఆర్‌టియు నాయకులు ఆనంద్, మరికొన్ని యూనియన్లు కారణమన్నారు. విజయోత్సవ సభలో సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు, ఆఫీస్ బేరర్లు నాయుడు, ఇ.ఆదినారాయణ, లక్ష్మణమూర్తి, అప్పారావు, గణేష్, ఒమ్మి అప్పారావు, రమణ, ఎంవి.ప్రసాదరావు, అనీల్, సురేష్, రాజశేఖర్, మహేశ్వరి, శ్రీను, రమణ, అప్పలరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరించకుంటే మళ్లీ సమ్మె



అనకాపల్లిలో మాట్లాడుతున్న శంకరరావు, శ్రీరామ్

ప్రజాశక్తి - అనకాపల్లి : మున్సిపల్ కార్మికులకు సంబంధించి కొన్ని డిమాండ్లను ఈనెల 30వ తేదీ లోపు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, పూర్తి సమస్యలు పరిష్కారం చేయకుంటే తిరిగి సమ్మెకు దిగుతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, యూనియన్ గౌరవ అధ్యక్షులు గంట శ్రీరామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ జోనల్ కమిషనర్ తో చర్చలు జరిపామని, కాంట్రాక్టు కార్మికులు మేస్త్రిలు ఇతర పనులు అప్పగించడం వలన పారిశుధ్య పనులు చేసే కార్మికులపై పని భారం పడుతుందని, వారిని వెంటనే తొలగించి పారిశుధ్య పనులు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేదంటే పనులు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొమ్మాల రాము, నిమ్మకాయల అజయ్, నూకరాజు, శివకుమార్, సంతోష్, గణేష్, శ్రీను, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వరకూ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సేవలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను గుంటూరు స్టేషన్ వరకు పొడిగించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 22701 విశాఖపట్నం - విజయవాడ - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు జనవరి 13 నుంచి గుంటూరు వరకూ వెళ్తుంది. ఇది విశాఖపట్నం నుండి ఉదయం 5.20 గంటలకు బయలుదేరి 11:25 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. మరలా 11.35 గంటలకు బయలుదేరి 13.00 గంటలకు గుంటూరు వెళ్తుంది. 22702 గుంటూరు - విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ జనవరి 13 నుంచి సాయంత్రం 16.00 గంటలకు గుంటూరులో బయలుదేరి 17.05 గంటలకు విజయవాడ చేరుకుని మరలా 17.15 గంటలకు బయలుదేరి రాత్రి 22:55 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది.

ఈ రైలు విశాఖపట్నం - గుంటూరు మధ్య దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా ప్రయాణిస్తుంది. ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనంలో జనంకోసం పేరుతో వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ చేపట్టిన పాదయాత్ర గురువారం 18వ వార్డులో సాగింది. 19వ రోజు 9 కిలోమీటర్లు ఆయన నడిచారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వాసవానిపాలెం, మూలపాలెం ప్రాంతాలలో సాగిన ఈ పాదయాత్రలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పుక్కళ్ల ధనలక్ష్మి శంకర్‌తో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పేర్ల విజయ్ చంద్ర, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్, చొక్కర శేఖర్‌రావు, అల్లంపల్లి రాజబాబు, కార్పొరేటర్లు కెల్ల సునీతా సత్యనారాయణ, ఉమ్మడి స్వాతి దాసు పాల్గొన్నారు.

మరికొన్ని కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు వస్తూనే ఉన్నాయి. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు అందజేసిన సమాచారం ప్రకారం డిసెంబర్ 21 నుంచి ఈ నెల 11 వరకు కోవిడ్ నిర్ధారణ టెస్టులు 1310 నిర్వహించారు. అందులో 69 మందికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం కోవిడ్ బాధితులు 38 మంది ఉండగా, 36 మంది ఇంటిలోనే ఉండి వైద్యసేవలు పొందుతున్నారు. ఇద్దరు మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఒక్కరోజే 71 టెస్టులు నిర్వహించారు. వీటిలో నాలుగు పాజిటివ్ వచ్చాయి. వారందరూ ఇంటి వద్దనే వైద్యం పొందుతున్నారు.

నైతిక విలువలతోనే ప్రగతి

గీతం జెమ్ 2024 కార్పొరేట్ సదస్సులో నిపుణులు


సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : పర్యావరణ హితమైన పారిశ్రామిక ప్రణాళికలు, సామాజిక బాధ్యత, నైతిక విలువలను పాటిస్తూ వ్యాపార నిర్వహణ ద్వారా సంస్థలు నిరంతరం ప్రగతిని సాధించగలవని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన జరుగుతున్న జాతీయస్థాయి యువజనోత్సవం జెమ్2024లో భాగంగా గురువారం నిర్వహించిన సదస్సులో పారిశ్రామిక నిపుణులు అభిప్రాయపడ్డారు. జీఎస్ఎస్.గ్రూప్ ఉపాధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ, కార్పోరేట్ రంగంలో ఉద్యోగస్తులకు సంస్థపై నమ్మకం పెంచేలా విధానాలు ఉండాలని, వివక్షకు తావులేని విధంగా సమాన అవకాశాలు కల్పిస్తూ వృత్తిలో రాణించేలా ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ ఆపరేషన్స్ విభాగాధిపతి శరవణన్, గోద్రేజ్ సంస్థ మార్కెటింగ్ విభాగాధిపతి శివ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్త అలోక్ తదితరులు తమ ప్రసంగాలలో కార్పోరేట్ రంగంలో నిలదొక్కుకోవాలంటే అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు.

స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆహ్వానం మేరకు వివిధ కళాశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలతో పాటు మేధస్సుకు పదును పెట్టే బిజినెస్ క్విజ్, బృంద చర్చలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. పోటీలలో పాల్గొనడానికి ఇతర రాష్ట్రాల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 ముగింపు దినోత్సవంలో విజేతలకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు బహుమతులు అందజేశారు. సంప్రదాయ నృత్యాలతో పాటు పాశ్చాత్య గీతాలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. జెమ్2024 సిఇఒ ఇందుకూరి సింధువర్మ, కన్వీనర్ డాక్టర్ కె.అశోక్, కో-కన్వీనర్లు డాక్టర్ జోసఫ్ పాల్, వి.చందన తదితరులు పాల్గొన్నారు.


నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న క్రైమ్ సిఐ సురేష్

నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : సంక్రాంతి పండుగ నేపథ్యంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సబ్బివీధిలో మహిళలకు భీమిలి నేర విభాగం పోలీసులు గురువారం అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద సాధ్య మైనంత వరకు సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని నార్త్ సబ్ డివిజన్ క్రైమ్ సిఐ కె.సురేష్ సూచించారు. భీమిలి నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. విలువైన వస్తువులున్నట్లైతే బ్యాంక్ లాకర్లలోగానీ, సురక్షిత ప్రదేశంలోగానీ లేదా వెంట ఉంచుకోవాలని చెప్పారు. పండగకు సొంతూరు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే, ఆ ఇంటి పరిసరాల్లో గస్తీ ఉంచుతామన్నారు.

లక్ష్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి -ఆనందపురం : విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ పర్వతారోహకుడు అన్మిష్ వర్మ పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని సొంట్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అటానమస్ (ఎన్ఎస్ఆర్ఐటీ)లో దెనాలి పర్వతాలతో సహా పలు ప్రసిద్ధ పర్వతాల శిఖరాలను జయించిన అన్మిష్ వర్మ స్ఫూర్తిదాయకమైన కీలకోపన్యాసం చేశారు. ప్రపంచంలోని కొన్ని అత్యున్నత శిఖరాలను జయించినందుకు తన విశేషమైన అనుభవాలను అన్మిష్ వర్మ పంచుకున్నారు. లక్ష్యాలను నిర్దేశించుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువతది కీలక పాత్ర అని ఉద్ఘాటించారు. ఎన్ఎస్ఆర్ఐటి యాజమాన్యం అన్మిష్ వర్మను సత్కరించింది. సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ మాట్లాడుతూ, వర్మ ప్రయాణం నుంచి విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ అకాడమిక్ ఎక్సెలెన్స్ హెడ్ అండ్ ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ పిఎస్ఇ.నవీన్, మెంబర్ కృష్ణమూర్తి, నేషనల్ సర్వీస్ స్కీం టీం హర గోపాల్, కాలేజ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ జె.రాజా మురుగదాస్ పాల్గొన్నారు.

పాత్రికేయుల పాత్ర గొప్పది

ప్రజాశక్తి -తగరపువలస : సమ సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర ఎంతో గొప్పదని పలువురు కొనియాడారు. భీమిలి మండలం తాళ్లవలసలో గురువారం జనసేన సీనియర్ నాయకులు గుడివాడ కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన పలువురు స్థానిక పాత్రికేయులకు సంక్రాంతి కానుకగా డైరీలు, పెన్నులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రజాసమస్యలను వెలికి తీయడం మొదలు వాటి పరిష్కారానికి పాత్రికేయులు చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. సీనియర్ జర్నలిస్టులు పి.రంగదామారావు, జి.శ్రీనివాసరెడ్డి, ఎల్.గణపతిరావు, రోజా, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. తమ కృషికి గుర్తింపుగా సత్కరించిన కిరణ్ కుమార్‌ను పాత్రికేయులు అభినందించారు. ఈ కార్యక్రమానికి జనసేన మండల కో-ఆర్డినేటర్లు సతీష్, రాజు, శ్రీను తదితరులు హాజరయ్యారు. సమాజ సేవకులు రామ్ మోహనరావు తన ప్రసంగంలో పలు సూచనలు అందజేశారు.

వైసిపి పాలనలో పేదలకు కష్టాలు : జనసేన

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు కష్టాలు తప్పలేదని జనసేన భీమిలి నియోజకవర్గ ఇంఛార్జి పంచకర్ల సందీప్ అన్నారు. జివిఎంసి నాలుగో వార్డు పరిధి మంగమారిపేటలో పార్టీ నాయకులు జి.అప్పారావు ఆధ్వర్యాన గురువారం పార్టీ జెండాను సందీప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరో మూడు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు కానుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమానికి ముందు బీచ్ రోడ్డు తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బివి.కృష్ణయ్య, ఎస్.శ్రీనుబాబు, నాగోతి నరసింహనాయుడు, సంతోషినాయుడు, పరిమి భువనేశ్వరి, ఎన్.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఆర్‌పి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యాన ఆరిలోవ టిబిసి పాయింట్ వద్ద గల ఎన్‌హెచ్ఆర్‌పి కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌హెచ్ఆర్‌పి చైర్మన్ రామచంద్రనాయుడు, ఎస్‌సి, ఎస్‌టి సెల్ జాతీయ ఇన్‌చార్జ్ పారిపల్లి రామారావు ముఖ్యఅతిథులుగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మురళి, అజయ్, దుర్గ పాల్గొన్నారు.

సింహగిరికి సంక్రాంతి శోభ

సన్నిధి ఫలాల సమర్పణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహగిరికి సంక్రాంతి శోభ నెలకొంది. వరుస పండుగలకు లక్షలాది మంది భక్తులు తరలిరానుండటంతో అందుకు తగ్గట్లుగానే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భోగి పర్వదినానికి గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో వారికి అవసరమైన సదుపాయాల కల్పనకు సంబంధించి ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, గురువారం పలు విభాగాల అధికారులు, స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబుతో కలిసి క్యూలైన్లతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఉచిత దర్శనం, 100, 300 క్యూలైన్ల వద్ద భక్తులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. సంక్రాంతికి పెద్ద ఎత్తున రైతులు కొత్త పంటలు (సన్నిధి ఫలాలు) సింహాద్రినాథుడికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. ప్రధానంగా గుమ్మడికాయలు, నూనె డబ్బాలు, వరి దుబ్బులు, పాలు, చెరకు, బెల్లంతో పాటు తమ పొలాల్లో పండించిన పంటలను ముందుగా స్వామికి సమర్పించి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఆయా సన్నిధి ఫలాలు ఎక్కడివరకు అనుమతించాలన్నది ఈవో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతేడాది ఉత్తర రాజగోపురం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి భక్తులు సమర్పించిన సన్నిధి ఫలాలను స్వీకరించినట్లు అధికారులు ఈవోకు వివరించారు. ఈ ఏడాది మరింతగా భక్తుల సంఖ్య పెరగనుందని, ఉచిత దర్శనం, 100, 300 క్యూలైన్లు ప్రారంభం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి భక్తులు సమర్పించిన సన్నిధి ఫలాలు స్వీకరించడం మంచిదని ఈవో అభిప్రాయపడ్డారు. అందుకు తగ్గట్లుగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు తెలుసుకోవడానికి వీలుగా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భోగి, సంక్రాంతితో పాటు కనుమ పండుగ సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న గజేంద్ర మోక్షం ఏర్పాట్లను ఈవో అడిగి తెలుసుకున్నారు. పండుగ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లూ పూర్తిచేయాలని ఈవో అధికారులను ఆదేశించారు. ఇక పండుగకు సంబంధించి సింహగిరిపై భారీ ఏర్పాట్లు, అలంకరణలు చేస్తున్నారు. ఈవోతో పాటు ఏఈవోలు భ్రమరాంబ, పి.నర్సింగరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


ఆరిలోవలోని భారతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో...

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పలు పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, ఆటపాటలతో విద్యార్థులు ఆనందంగా గడిపారు.

ఆరిలోవ : ఆరిలోవ, టిబిసి పాయింట్ వద్ద గల భారతి ఇంగ్లీషు మీడియం స్కూల్లో గురువారం సంక్రాంతి సంబరాలను పాఠశాల అధినేత ఎంవి.రావు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భోగి మంటలు, పొంగలి, భోగి పండ్లు, బొమ్మలు కొలువులు, ఆటపాటలతో నృత్యాలు చేసి ఆనందంగా గడిపారు. పాఠశాల అధినేత ఎంవి.రావు మాట్లాడుతూ, భోగి ప్రాముఖ్యతను, తదుపరి మకర సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలమును, కనుమ పండగల విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'విశాఖ ఇంజినీరింగ్'లో

వేపగుంట : నరవలోని విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సంక్రాంతి వేడుకలను వైఎస్ ప్రిన్సిపల్ బి.జీవనరావు ప్రారంభించారు. సంక్రాంతి పండగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రాంగణంలో రంగోలి, పాటలు, ప్రాచీన వంటకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. భోగి మంటలు, గొబ్బెమ్మలు వేసి హరిదాసు కీర్తనలను ఆలపించారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ స్కూల్లో...

పరవాడ : స్థానిక సంస్కృతి గ్లోబల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పచ్చనితోరణాల ముంగిట రంగు రంగుల ముగ్గుల మధ్య స్నేహితులతో, ఆటలు పాటలతో సంప్రదాయ వస్త్రధారణతో, రకరకాల వేషధారణలతో చిన్నారులు పాల్గొన్నారు. ఈ పండగ విశిష్టతను పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలియజేశారు. పాఠశాల డైరెక్టర్ ఉదయనాగశ్రీ చిన్నారుల తలపై రేగుపండ్లు పోసి దీవించారు. భోగి, సంక్రాంతి, కనుమల ప్రాముఖ్యత, అవస్యకతని వివరించిన విద్యార్థులు ఆద్య, శ్లోక, అనురాధ, వైష్ణవి, సహస్రలను సోదమ్మ, హరిదాస్ భసవన్న, బుడుబుక్కల జంగం వేషధారణ వేసిన చరిష్మా సౌర్య, సంజయ్, తరుణ్, జైనిష్‌ను, పండగ ఉట్టిపట్టే నృత్యం చేసిన నృత్య బందంకు, నాటి -నేటి సంప్రదాయం విలువలు పేరుతో ప్రదర్శించిన నాటక బృందానికి, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, పూజిత, వినీలా, రేఖ, లీలాకు పాఠశాల సీఈఓ కె.నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి అభినందనలు తెలిపారు.

వాడ్రాపల్లిలో

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. పండగ వాతావరణం కొట్టొచ్చినట్లుగా గ్రామాన్ని తీర్చిదిద్దారు. రంగురంగుల ముగ్గులు వేసి మహిళలు వాటిపై గొబ్బెమ్మలు ఉడిపెట్టి సందడి చేశారు. వాకిళ్లలో కట్టెల పొయ్యిపై పొంగలి ఉడికించే సన్నివేశాలు అబ్బురపరిచాయి. పలు సంప్రదాయ కళారూపాలు ప్రదర్శించి సంక్రాంతి శోభను ఉట్టిపడేలా చేశారు.


సంస్కృతి గ్లోబల్ స్కూల్లో...

ఆధునిక హంగులతో తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి-గాజువాక : ప్రభుత్వ నిధులు, దాతల సహాయంతో ఆధునీకరణ పనులు పూర్తి చేసుకున్న గాజువాక తహశీల్దార్ కార్యాలయం ఆధునిక హంగులు, అదనపు వసతులతో అందుబాటులోకి వచ్చింది. పనులు పూర్తైన నేపథ్యంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సమకూర్చిన, దాతలు అందజేసిన వివిధ రకాల నిధులతో కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రజలు, కార్యాలయ సిబ్బంది సౌకర్యార్థం అదనపు వసతులు సమకూర్చారు.

సమిష్టి కృషితో అభివృద్ధి ఫలాలు : జిల్లా కలెక్టర్

అధికారులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి ఉంటే అభివృద్ధి ఫలాలు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, పనులు చేపడతామని స్థానిక అధికారులు తెలిపిన వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ నిధులకు తోడుగా స్థానిక దాతలు కొంతమేర ఆర్థిక వనరులు సమకూర్చటం హర్షణీయమని అన్నారు. స్థానిక అధికారుల చొరవ కూడా ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్నది ఎన్నికల కాలం కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలని, మంచి పనితీరు కనబరచాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీవల్లి, స్థానిక ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఆధునీకరించిన గాజువాక తహశీల్దార్ కార్యాలయం

రేషన్ తీసుకోవాలంటే పని మానుకోవాల్సిందేనా?

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటా కాలనీలో రేషన్ బియ్యం తీసుకోవాలంటే పనులు మానుకోవాల్సి వస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనం ఎప్పుడొస్తుందో తెలియక అవస్థలు పడుతున్నారు. వాహనం వచ్చినప్పుడు తీసుకోవాల్సి రావడంతో పనులకెళ్లే వారు సహజంగా తొందరపడుతుంటారు. ఈ క్రమంలో మహిళల మధ్య తగాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొంత కాలంగా వాలంటీర్లు కూడా సరిగా సమాచారం ఇవ్వడంలేదు... పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటింటికీ బియ్యం అందిస్తానని జగన్మోహన్‌రెడ్డి చెప్పినా అందరూ పనులు మానుకొని వాహనం కోసం ఎదురుచూసే దుస్థితికి వచ్చిందని ఐద్వా నాయకులు లక్ష్మీ ఎద్దేవాచేశారు. సరఫరా సక్రమంగా జరగకపోయినా సివిల్ సప్లై విభాగం అధికారులు కూడా పట్టించుకోవడంలేదన్నారు.



చొక్కాకుల వెంకటరావును అభినందిస్తున్న కెకె.రాజు తదితరులు

చొక్కాకులకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశె పిసిపిబిఆర్ యుడిఎ ఛైర్మన్‌గా నియమితులైన చొక్కాకుల వెంకటరావును గురువారం సీతమ్మధారలోని ఆయన స్వగృహంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకులు కాశీ విశ్వనాథ్, డిప్యూటీ మేయర్ కట్టుమూరు సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, 14వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు, మిడతాను బాపునాయుడు, మురళీనగర్, మాధవధార, వెలమ సంక్షేమ సంఘం పెద్దలు, నాయకులు, బంధువులు తదితరులు ఉన్నారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారందరికీ చొక్కాకుల వెంకటరావు ధన్యవాదాలు తెలిపారు.

'మన ఊరు- మన ఆట' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రచార కమిటీ ఛైర్మన్ బన్నీ వాసు రూపొందించిన 'మన ఊరు - మన ఆట' కార్యక్రమ పోస్టర్‌ను ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త నాగలక్ష్మి చౌదరి మాట్లాడుతూ, జనసేన మహిళా విభాగం ఆధ్వర్యాన సంక్రాంతి పండగ వేళ 'మన ఊరు -మన ఆట' అంటూ రంగ వల్లులు, పిండి వంటలతో మహిళలకు ప్రత్యేక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు కిరణ్‌ప్రసాద్, కె.త్రివేణి, మంథా నాగసుధ, కె.రూప పాల్గొన్నారు.



పార్టీ విధానాలతో ముద్రించిన పోస్టర్‌ను విడుదలచేస్తున్న నాయకులు

జనవాహిని నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఆరిలోవ : జనవాహిని పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం ప్రకటించారు. ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద ఎన్‌హెచ్ఆర్‌పి కార్యాలయంలో పార్టీ సమావేశానికి జనవాహిని జాతీయ అధ్యక్షుడు డిఎస్ఎన్ఎస్ ప్రసాదుబాబు హాజరయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా మేడిచర్ల మురళిని నియమించారు. ఆయన నేతృత్వంలో విశాఖ జిల్లా అధ్యక్షులుగా చోడవరపు శేఖర్, విజయనగరం జిల్లా అధ్యక్షులుగా రుద్రరాజు దిలీప్, కాకినాడ, బాపట్ల జిల్లాల అధ్యక్షులుగా టి.త్రిమూర్తులు, గోపీనాద్‌ను నియమించారు. ఈ సందర్భంగా ప్రసాదుబాబు మాట్లాడుతూ, ఉచిత విద్య, వైద్యం, నీరు ముఖ్య అజెండాగా రాబోయే సార్వత్రిక ఎన్నికలకు వెళతామన్నారు. పార్టీ పూర్తి అజెండాను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ విధివిధానాలు ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

భారత్-ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌కు పటిష్ట ఏర్పాట్లు



టెస్ట్ మ్యాచ్ ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్, సిపి, ఎసిఎం సెక్రటరీ

ప్రజాశక్తి- పిఎం పాలెం : ఎసిఎ, విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు జరిగే భారత్ -ఇంగ్లాండ్ రెండవ టెస్ట్ మ్యాచ్‌కు సంబంధించి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామని నిర్వహణ కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర సిపి రవిశంకర్ అయ్యర్, ఎసిఎ సెక్రటరీ ఎస్ఆర్ గోపీనాథ్ రెడ్డి తెలిపారు. స్టేడియం ఆవరణలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఇతర దేశాల నుంచి వచ్చే క్రీడాకారులకు కట్టుదిట్టమైన భద్రత, వసతి ఏర్పాట్లు చేశామని చెప్పారు. మ్యాచ్‌ను తిలకించేందుకు రోజుకు 2000 మంది విద్యార్థులకు తమ ఐడి కార్డుతో ఉచితంగా చూసేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ మ్యాచ్‌కు సంబంధించి టిక్కెట్లు విక్రయాలు 15వ తేదీన ఆన్‌లైన్, పేటిఎం, ఇన్‌సైడర్ లింక్ ద్వారా పొందవచ్చని, 26వ తేదీన ఆఫ్‌లైన్ ద్వారా స్టేడియం వద్ద, స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో టిక్కెట్లు విక్రయాలు నిర్వహించనున్నట్లు వివరించారు. రోజువారీగా చూసేందుకు రూ.100 నుంచి రూ.500 ధరలలో టికెట్లు విక్రయిస్తున్నామని, ఈ సెషన్ మొత్తం చూసేందుకు రూ.400 నుంచి రూ.1500 వరకు టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మ్యాచ్ ఉదయం 9.30 నుండి సాయంత్రం ఐదు వరకు జరుగుతుందని తెలిపారు. ఈ మ్యాచ్ చూసేందుకు వచ్చిన అభిమానులకు రెండు టికెట్లను అందజేస్తామని, మ్యాచ్ మధ్యలో బయటకు వెళ్లినా మరలా వచ్చేందుకు ఇంకో టికెట్‌ను ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిపి-1 శ్రీనివాసరావు, ట్రెజరర్ చలం తదితరులు పాల్గొన్నారు.

45వ వార్డులో 'గుడ్‌మార్నింగ్ నార్త్'

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం గుడ్ మార్నింగ్ నార్త్ కార్యక్రమంలో భాగంగా 45వ వార్డు పరిధి నరసింహనగర్, పోర్టు క్వార్టర్స్, లక్ష్మీ నారాయణపురం, వాసుదేవనగర్‌లో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనుక్ క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా బిటి.రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. వాటిని కూడా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. 256వ సచివాలయంలో 45వ వార్డుకు సంబంధించిన నూతన పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణి, ఎఇ ఉమా మహేశ్వరరావు, 45వ వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, యాత కార్పొరేషన్ ఛైర్మన్ పిల్లి సుజాత, హరిపట్నాయక్, నాయుడు, రాజు యాదవ్, బాబూరావు, నాని, జోగి నాయుడు, సురేష్, ప్రభాకరరావు, శ్రీనివాస్, మాత ఈశు, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.



పింఛన్లు అందిస్తున్న కెకె.రాజు

రోడ్డుపైనే డెబ్రిస్



రోడ్డుపై సగభాగం వరకు ఉన్న డెబ్రిస్

ప్రజాశక్తి -వేపగుంట : అసలే ఇరుకు రోడ్డు.. ఆపై రోడ్డు మీదే డెబ్రిస్‌ను ఉంచేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్‌లో వీధి కాలువల నిర్మాణం కోసం రూ.16 లక్షలు మంజూరై రెండున్నరేళ్లు అయింది. స్థానిక వైసిపి నాయకుల తీరుతో ఎమ్మెల్యే అదీప్‌రాజు శంకుస్థాపన చేయలేదు. దీనిపై ప్రజాశక్తి దినపత్రిక కథనం ప్రచురించడంతో ఇటీవల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరు పనులు కూడా ప్రారంభించారు. కాలువలు తవ్వి ఆ డెబ్రిస్‌ను రోడ్డు పైనే ఉంచేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలను తీయలేక అవస్థలు పడుతున్నారు. 10 అడుగులు మేర ఉన్న రోడ్డులో సగభాగం డెబ్రిస్ వేసి వదిలేస్తే ఎలా నడవాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపై డెబ్రిస్‌ను తొలగించి, పనులు తొందరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -వేపగుంట : పురుషోత్తపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైను పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఎల్‌బి.నగర్, కృష్ణరాయపురం ఫీడర్ పరిధిలో ఉన్న బాలాజీనగర్, గాయత్రీనగర్, గౌరివిశ్వేశ్వర కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, మరిడిమాంబ కాలనీలకు సరఫరా ఉండదని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి -గోపాలపట్నం : బాజీ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో తృటిలో ప్రమాదం తప్పింది. బిఆర్‌టిఎస్ ప్రధాన రహదారుకు ఇరువైపులా ఉన్న హై వోల్టేజ్ వైర్లలో ఒక వైర్ తెగి మంటలు వచ్చాయి. ఆ సమయంలో రోడ్డు మీద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సకలంలో స్పందించి తన చేతిలో ఉన్న లాటితో వైరును పక్కకు నెట్టి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. సమాచారం అధికారులకు చేరవేయడంతో సమస్యను పరిష్కరించారు.

ఆత్మచిత్రం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో శ్రీ విశ్వ కళ్యాణ భారతి సేవా సంఘం ఆధ్వర్యాన కిలాడి సత్యనారాయణ రచించిన ఆత్మచిత్రం పుస్తకాన్ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీస్ శాఖలో ఉన్నతాధికారిగా ఉంటూ జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ కేదార్‌నాథ్ సింగ్ కవిత్వాన్ని అనువాదించి ఆత్మచిత్రం పుస్తకాన్ని రూపొందించడం ప్రశంసనీయమన్నారు. పుస్తక రచయిత కె.సత్యనారాయణ మాట్లాడుతూ ఎందరో కవులతో సంభాషణలు జరిపి సాహిత్యం పైన చక్కని అవగాహన పెంపొందించుకొని పుస్తకాలను రూపొందించ గలుగుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవి.రాజశేఖర్, నగరానికి చెందిన పలువురు సాహితీవేత్తలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. పుస్తకావిష్కరణకు ముందు ప్రదర్శించిన కూచిపూడి నృత్య అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఏయూ భూముల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వ విద్యాలయం భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. మధురవాడ నగరంపాలెంలో ఉన్న ఏయూ భూములను ఆకస్మికంగా గురువారం తనిఖీ చేసి, పరిశీలించారు. రిజిస్ట్రార్ వెంట యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా రద్దు చేయాలి

-రౌండ్‌టేబుల్ సమావేశం పార్టీలు, ప్రజాసంఘాల ఏకగ్రీవ తీర్మానం
-సంక్రాంతిలోపు తేల్చకపోతే ప్రత్యక్ష కార్యాచరణ

ప్రజాశక్తి- అనకాపల్లి

అంగన్‌వాడీలపై ప్రభుత్వం విధించిన ఎస్మాను తక్షణమే రద్దు చేయాలని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించి జీతాలను పెంచాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సంక్రాంతిలోపు ఈ డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించాయి. ఉద్యోగ కార్మిక సంఘాల సమ్మెలకు మద్దతుగా సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యాన గురువారం దొడ్డి రామునాయుడు భవన్లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణాలో కన్నా రూ.1000 అదనంగా వేతనం పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని 31 రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా దుర్మార్గంగా ఎస్మాను ప్రయోగించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న అబద్ధాలకు అంతు లేకుండా పోయిందన్నారు. సంక్రాంతిలోపు సమ్మెలో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అన్ని పార్టీలు ప్రత్యక్ష ఆందోళనకు దిగడంతోపాటు, రాష్ట్ర బంద్ చేపడతామని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రాజాన దొరబాబు, వై.ఎన్.భద్రం(సిపిఐ), పావాడ కామరాజు (జనసేన), వెంకటరావు(టిడిపి), గంటా శ్రీరామ్ (సిపిఎం), కట్టనూరి నూక అప్పారావు (కాంగ్రెస్), శ్రీనివాసరావు (ఆమ్ ఆద్మీ), రామచంద్రరావు (ఆల్ తెలుగు ప్రజల పార్టీ), సూదికొండ మాణిక్యలరావు (దళిత బహుజన సంఘం), కర్రి అప్పారావు, గండి నాయనబాబు(ఎపి రైతు సంఘం), కోరిబిల్లి శంకరరావు (రైతు సంఘం), సిహెచ్.శివాజీ (డివైఎఫ్ఐ), నూకఅప్పారావు (ఎన్‌పిఆర్‌డి), డి.శ్రీనివాసరావు (సిఐటియు), బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

గంగరాజుకు యువ శాస్త్రవేత్త అవార్డు

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రాంతాల మధ్య ప్రజల్లో వ్యాధుల తీవ్రత, వ్యత్యాసంపై పరిశోధనాత్మక ప్రచురణకు గాను 2023 సంవత్సరానికి మండలంలోని పిండ్రంగి గ్రామానికి చెందిన రంగం దేవుడు కుమారుడు డాక్టర్ మల్లారపు గంగరాజు యువ శాస్త్రవేత్త అవార్డు పొందారు.



విశాఖ బుల్లయ్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గంగరాజు ఢిల్లీకి చెందిన నేషనల్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అకాడమీ ద్వారా మెడికల్ జియోగ్రఫీలోని మైదాన తీర ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు, కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల మధ్య మలేరియా తదితర వ్యాధుల తీవ్రత వ్యత్యాసంపై పరిశోధనలు చేశారు. ఈ వ్యాధుల వ్యత్యాసాన్ని రిమోట్ ఫెన్సింగ్, భౌగోళిక సమాచార వ్యవస్థతో ప్రచురించడం జరిగిందని ఆయన తెలిపారు. యువ శాస్త్రవేత్తగా ఎంపికైన గంగరాజును బుల్లయ్య కళాశాల యాజమాన్యం కేసిసి రెడ్డి , డాక్టర్ జి మధు కుమార్ , డాక్టర్ చక్రవర్తి , సోమేశ్వర్ రెడ్డి , లక్ష్మణ బాబు, పిండ్రంగి గ్రామ ప్రజలు అభినందించారు.

సంక్రాంతి కవి సమ్మేళనం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శాఖాగ్రంథాలయంలో బుధవారం రాత్రి అనకాపల్లి సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో సంక్రాంతి లక్ష్మికి స్వాగత కవి సమ్మేళనం నిర్వహించారు. ప్రముఖ కవి మాధవీ సనారా ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన అంతర్జాతీయ తెలుగు మహాసభల విశేషాలను ఈ సందర్భంగా వివరించారు. అనకాపల్లి సాహితీమిత్రులు సాహితీ సంస్థ 14వ సంవత్సరంలో అడుగు పెట్టిందని, ఇంతవరకూ ఈ సంస్థకు కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి నూతన కన్వీనర్ ప్రముఖ కవి, కథా రచయిత గొంతిన రంగబాబుకు బాధ్యత అప్పగించారు. గ్రంథాలయ సహాయకురాలు నూకరత్నంకు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలను రచయిత్రి రేగురగడ్డ వేంకట లక్ష్మీ గాయత్రి బహూకరించారు. హిందీ భాషా దివస్ సందర్భంగా తాము రాసిన హిందీ సూక్ష్మ రామాయణ గానం చేశారు.

బిఆర్.అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి- అనకాపల్లి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి శ్లాఘించారు. సామాజిక సమతా సంకల్ప కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై స్థానిక ఎంపీడీవో మందిరంలో గురువారం ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఈ ఛాయా చిత్రాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అంబేద్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన, వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ జీవిత విశేషాలపై అవగాహన పెంపొందిస్తూ వివిధ పోటీలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలోని అంబేద్కర్ విగ్రహాలను శుభ్రం చేసి ఘనంగా నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ డి వరాహ సత్యవతి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి అజయ్ బాబు, అనకాపల్లి ఎంపీపీ గొర్లె సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

జిల్లాలో 13,244 మందికి జగనన్న తోడు

ప్రజాశక్తి- అనకాపల్లి : జగనన్న తోడు పథకం 8వ విడత కింద జిల్లాలో 13,244 మంది లబ్ధిదారులకు రూ. 14 కోట్ల 1 లక్ష 33 వేలు వారి ఖాతాలకు జమచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. గురువారం జగనన్న తోడు పథకంలో భాగంగా చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాలు, జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించినవారికి సంబంధించిన వడ్డీ రాయితీని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా లబ్దిదారుల ఖాతాలకు జమచేసే కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిరువ్యాపారులు, సాంప్రదాయ వత్తులవారి ఉపాధికి ఊతంగా జగనన్న తోడు నిలుస్తోందన్నారు. అదే విధంగా జగనన్న తోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన 18,376 మంది లబ్దిదారులకు రూ. 30 లక్షల 66 వేల 863లు వడ్డీ రీయింబర్స్ మెంట్ కింద లబ్దిదారులకు జమచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ బి. వరాహ సత్యవతి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, డి ఆర్ డి ఎ పి.డి. శచీ దేవి, మెప్మా పిడి సరోజిని, మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

బిసి చైతన్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ చేపట్టిన జయహో బీసీ చైతన్య యాత్రను గురువారం టిడిపి అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగ జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై దాడులు, అరాచకాలు పెరిగాయన్నారు. బీసీ నిధులు రద్దు చేసి దారి మళ్లించడం, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లుగా వైసిపి కార్యకర్తలను నియమించుకొని ప్రజాధనాన్ని వారికి జీతాల రూపంలో ఇస్తూ బడ్జెట్లో కేటాయించిన నిధులను బీసీలకు అందకుండా చేసిన జగన్ రెడ్డి ప్రభుత్వం బీసీల ద్రోహిగా నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఇసుక మైన్, మట్టి, గ్రావెల్ భూ అక్రమాలను ప్రజలకు వివరించడానికి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో బీసీ చైతన్య యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గాల ఇన్‌చార్జులు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవింద సత్యనారాయణ, పివిజి కుమార్, బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, పార్టీ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్ల సురేంద్ర, గుర్రము నూకరాజు, గింజల లక్ష్మణరావు, బత్తుల లక్ష్మి, శ్రీనివాసరావు, ఆడారి కిషోర్ కుమార్, జూరెడ్డి రాము పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక సంస్థలలో జగన్ రెడ్డి రద్దు చేసిన 10శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన ఇంచార్జీ పరుచూరి భాస్కరరావు ,టీడీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. కశింకోట మండల బిసి జయహో సమావేశము గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, మాధంశెట్టి నీలబాబు,మళ్ల సురేంద్ర, పెంటకోట రాము, సిద్ధి రెడ్డి శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ నాయకులు గుర్రం నూకరాజు, బత్తుల లక్ష్మి, ఒనము శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

డైట్ విద్యార్థికి సృజనావాణి స్కాలర్ షిప్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న సిమ్మా జయంత్‌కు సృజనావాణి వాలంటరీ అసోసియేషన్ ద్వారా రూ.14000 స్కాలర్షిప్ లభించింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ స్కాలర్షిప్ తమ విద్యార్థికి లభించడం చాలా హర్షనీయమని, మరింత మంది విద్యార్థులు రానున్న కాలంలో స్కాలాషిప్లు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి దేవి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ వైకుంఠరావు, డీన్ అకాడెమిక్స్ కె. పార్వతి, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ కష్ణ నాగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి జీతాల కోసం ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు సంక్రాంతి పండుగలోపు 2నెలలు బకాయి పడ్డ జితాలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ %డ%ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రి వద్ద గురువారం కార్మికులతో నిరసన తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన శానిటైజెన్, సెక్యూరిటీ కాంట్రాక్టర్లు మాట్లాడుతూ త్వరగా జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి. రవి, కార్మికులు వర ప్రసాద్, వడ్డాది పోలరావు, వి.ఈశ్వరరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఎపిసిపిఎస్ఇఎ అధ్యక్షునిగా కోరుకొండ సతీష్

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట



ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్య పెన్షన్ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షునిగా అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం తురకలపూడి గ్రామానికి చెందిన చెందిన కోరుకొండ సతీష్ ఎన్నియ్యారు. విజయవాడలో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక జరిగింది. 2017 నుండి ఏపీసిపిఎస్ఇఎ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా సతీష్ పని చేశారు. సతీష్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రొంగలి అప్పలరాజు, అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాడి సూర్య ప్రకాష్, మోటూరు త్రినాధ స్వామి, మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్బారావు చుక్కల రాము, విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గూనూరు శ్రీను, దేవుడు బాబు, అల్లూరి జిల్లా సిపిఎస్ నాయకులు కూర్మారావు, ఈశ్వరరావు, వెంకటరమణ తదితరులు అభినందనలు తెలియజేశారు.

కబ్జాదారుల కోసమే భూ యాజమాన్య హక్కు చట్టం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం - 2023ను భూకబ్జాదారుల కోసమే తెచ్చారని ప్రజలు భయపడుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. చట్టాన్ని నిరసిస్తూ జిల్లా కోర్టు అవుట్ గేటు వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ చట్టంపై రాజకీయ పార్టీలతో, రైతు సంఘాలతో, న్యాయవాదులతో చర్చలు జరపకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా రహస్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. నీతి ఆయోగ్ చెప్పిందని చట్టం తెచ్చినట్లు ప్రభుత్వం నమ్మబలకడం సరికాదన్నారు. నీతి ఆయోగ్ జగన్మోహన్ రెడ్డి ఒక్కడికే చెప్పిందా చట్టం తెమ్మని అని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి చట్టం తేలేదన్నారు. మూడు నెలల్లో ఎన్నికలు ఉన్నాయని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పైలా శ్రీనివాసరావు, పోరాట కమిటీ కన్వీనర్ బి.సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మహిళా మార్ట్ వద్ద డ్వాక్రా మహిళల నిరసన

పొదుపు ఖాతాల నుంచి డబ్బు ట్రాన్స్‌ఫర్, బలవంతపు కొనుగోలు, బెదిరింపులపై ఆగ్రహం

ప్రజాశక్తి-చోడవరం రూరల్

మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళల చేత బలవంతంగా కొనుగోలు చేయించడాన్ని వ్యతిరేకిస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన చోడవరం మహిళా మార్ట్ ఎదుట డ్వాక్రా మహిళలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి, నాయకులు రామలక్ష్మి, ఐద్వా జిల్లా నాయకులు డి.డి.వరలక్ష్మి మాట్లాడుతూ చోడవరంలో మహిళా మార్ట్ ఏర్పాటు పేరుతో గతంలో ప్రతి డ్వాక్రా గ్రూప్ నుండి రూ.3000 చొప్పున బలవంతంగా కట్ చేశారని, మార్ట్ పెట్టిన తరువాత టార్గెట్ ఇచ్చి కచ్చితంగా రూ.2000కు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, కొనుగోలు చేయకపోతే రుణమాఫీలు, రుణాలు ఆపేస్తామని విఒఎల చేత బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా డ్వాక్రా మహిళలకు తెలియకుండానే వాళ్ల పొదుపు ఖాతా నుండి డైరెక్ట్‌గా మహిళా మార్ట్ అకౌంట్‌కి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారన్నారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న మహిళలు, ఒంటరి మహిళలు, రోజువారి కూలీలు డ్వాక్రా గ్రూపుల్లో అధికంగా ఉన్నారని, అలాంటి వాళ్లతో ఇలా వారికి అవసరమున్నా లేకపోయినా బలవంతంగా సరుకులు కొనాలని ఇబ్బంది పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై చర్యలు ఆపాలని, లేకుంటే డ్వాక్రా మహిళలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు బుచ్చి రాజమ్మ, రమణమ్మ, రాధ, పార్వతమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఐద్వా ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ మరిడిమాంబ ఫంక్షన్ హాల్‌లో అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ 215వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పులామాలలు వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వాన్ని జయించి అంధులందరికీ అక్షర జ్ఞానాన్ని ప్రసాదించి వారి జీవితాలలో వెలుగును నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. బ్రెయిలీ లిపి నేర్చుకుని నేడు ఎంతోమంది ఆయా రంగాలలో విజయం సాధిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వికలాంగులు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, వైసిపి నాయకులు వెన్నెల సన్యాసిరావు, పైల అప్పలనాయుడు, బొద్దపు చిన్నారావు, సాధన ఫౌండేషన్ ఇస్మాయిల్, కంచిపాటి భాస్కర్ పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని దిబ్బపాలెం పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయిపడిన 13 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం గ్రీన్ అంబాసిడర్లుతో కలిసి ఆయన ఆందోళన చేశారు. పంచాయతీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా ఎలక్ట్రిషన్ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారని తెలిపారు. అరకొర జీతం కూడా 13 నెలల జీతాలు రాక పండగ పూట ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ విధానం రద్దు చేసి ప్రభుత్వం నేరుగా జీతం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలకు అనుగుణంగా వేతనాల పెంచాలని, పనిముట్లు సబ్బులు, బ్లౌజులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనంతరం గామ సచివాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు.

హామీల అమలులో వైసిపి విఫలం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. గురువారం దేవరాపల్లి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విపత్తుల కాలంలో రైతన్నలకు చెల్లించాల్సిన సొమ్ము నేటికీ జమ చేయలేదన్నారు. మద్యం నిషేధం అని మాయ మాటలు చెప్పి మద్యంతో వచ్చిన సొమ్ముతోనే సర్కారు జల్సాలు చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాలు రోడ్డెక్కి ప్రభుత్వంపై వ్యతిరేకత చూస్తుంటే ఈ పార్టీ పై ప్రజలకు పూర్తిగా విశ్వాసం పోయిందని అర్థమవుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సీనియర్ నాయకుడు ఎల్లేటి కరుణాకరరావు, తెనుగుపూడి మాజీ ఎంపిటిసి పెంటకోట అప్పలనాయుడు, బండారు శ్రీరామ్మూర్తి, గవిరెడ్డి దేముళ్ళు, రెడ్డి నాయుడు, ఈర్లె రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 7 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తారువ గ్రామానికి చెందిన అల్లు ఎడ్యు ఫెస్ట్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తిమిరాం మదర్ థెరిసా స్కూల్లో ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వాహకులు అల్లు గోపి మాట్లాడుతూ, నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి 25 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు ఈ ప్రతిభా పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. ఇందులో కైలాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి పి.భవదీప్ ప్రథమ స్థానం, మదర్ థెరిసా పాఠశాల విద్యార్థి ఎం.భార్గవ నాయుడు ద్వితీయ స్థానం, ఎంజెపి సింహాచలంకు చెందిన విద్యార్థి ఎ.పృథ్వీ మూడో స్థానం సాధించగా వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మరి కొంతమంది విద్యార్థులకు కూడా నగదు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు దాసరి గోపి, ఎ.శ్రీనివాసరావు, ఎల్.అప్పలనాయుడు, సిహెచ్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు సంక్రాంతి బోనస్ పంపిణీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని గంగాదేవి పేట గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న 20 మంది పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కొండ్రపు శేషు చేతుల మీదుగా రూ.1,55,000 బోనస్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న రైతులకు, వారి పాడి పశువులకు పలు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బి.నరేష్, ఎం.జగ్గలక్ష్మి, బి.బలరాం, కె.సీతారాం, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ఐక్య పోరాటాలతోనే విజయం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఐక్య పోరాటాలు చేయడం ద్వారానా విజయం సాధించవచ్చని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ల పరిష్కారానికి గత 22 రోజులుగా చేస్తున్న సమ్మె ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను విరమించి గురువారం విధులకు హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగిన ముగింపు సభలో కోటేశ్వరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు పూడి వెంకటరావు, అచ్యుత కృష్ణ మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఐక్యంగా పోరాడి సమస్యల పరిష్కరించుకున్నారని తెలిపారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. ఇదే పోరాటస్ఫూర్తితో ప్రభుత్వ ఇచ్చిన హామీల అమలు కోసం ఇదే ఐక్యతతో భవిష్యత్తులో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో ధర్నా శిబిరంలోనే బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందిన జడ్డు వాసుదేవరావుకు, ఇదే సమయంలో మృతి చెందిన కోటేశ్వరమ్మకు సభ ఘనంగా నివాళులర్పించింది. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కృష్ణ, సత్యారావు, సతీష్, ప్రసాద్, నూకేష్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి పండుగ గురువారం అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లివిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, వైసిపి అనకాపల్లి సమన్వయకర్త భరత్ కుమార్ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భరత్ కుమార్ పర్యటన

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ బుధవారం రాత్రి మండలంలోని అచ్చెర్ల, కొత్తఅచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో పర్యటించి వివిధ పరిచయ వేదికల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ వైసిపి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు, వైసిపి నాయకులు మలసాల కిషోర్, కరక సోమునాయుడు, గొంతిన శివ, సర్పంచులు నిమ్మదల సొమేశ్వరరావు, నిమ్మదల నాగేశ్వరరావు, గోకివాడ గోవింద పాల్గొన్నారు.

జనసేన కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : జనసేన పార్టీ ముద్రించిన 2024 కేలండర్‌ను ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇన్చార్జి రాయిపురెడ్డి కృష్ణ, మండల నాయకులు కుంచ అంజిబాబు ఆధ్వర్యంలో మండలంలోని కె.సంతపాలెం గ్రామంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చుక్క నారాయణమూర్తి, బాలు బోయిన సంతోష్ కుమార్ యాదవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన మండల అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

జనసేన పార్టీ బుచ్చయ్యపేట మండల అధ్యక్షుడిగా కందిపూడి గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సింహాచలం నాయుడు నియమితు లయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన నాయుడును చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి పివిఎస్ఎన్ రాజు అభినందించారు. మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి తన శక్తివంతం లేకుండా కృషి చేస్తానని నాయుడు తెలిపారు.


నాయుడును అభినందిస్తున్న పివిఎస్ఎన్.రాజు

కశింకోట : కశింకోట మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా బుదిరెడ్డి చిన్నా నియమించారు. తనను నియమించినందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరుచూరి భాస్కరరావుకు చిన్నా కృతజ్ఞతలు తెలిపారు.


బుదిరెడ్డి చిన్నా

సబ్బవరం : మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా కర్రి కనకరాజును నియమిస్తూ గురువారం ఉత్తర్వులు అందాయి. తనపై నమ్మకం ఉంచి మండల పార్టీ అధ్యక్షులుగా నియమించి నందుకుగాను తమ్మిరెడ్డి శివశంకర్‌కు, విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబుకు కనకరాజు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.


కర్రి కనకరాజు

మునగపాక : మునగపాక జనసేన పార్టీ మండల అధ్యక్షునిగా టెక్కలి పరశురాం నియమితులయ్యారు. తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారిని జనసేన పార్టీ గుర్తిస్తుందన్నారు.


టెక్కలి పరశురాం

కోటవురట్ల: . జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా శింగంపల్లి శ్రీనివాస్‌ను ఎంపిక చేయడం పట్ల మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. గురువారం శ్రీనివాస్‌కు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన నాయకులు గెద్దం బుజ్జి తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి శక్తివంచన లేకుండా న్యాయం చేస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.


సింగంపల్లి శ్రీనివాస్

ఆనందపురం: ఆనందపురం మండల జనసేన పార్టీ అధ్యక్షులుగా తమ్మిన అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయం నుండి తమ్మిన ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే ఎన్నికలలో జనసేన, టిడిపి గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ పదవిని ఇచ్చినందుకు పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు, భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ పంచకర్ల సందీప్‌కు ధన్యవాదాలు తెలిపారు.


తమ్మిన అప్పలరాజు



యథేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలు

గ్రావెల్ దందా!

- నిబంధనలకు విరుద్ధంగా భారీస్థాయిలో తరలింపు
- తహశీల్దార్ అనుమతులతో పక్క మండలానికి ...
- భూయజమానికి చెప్పకుండా తీసుకెళ్లడంపై విమర్శలు

ప్రజాశక్తి - చీడికాడ : నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో అడవి అగ్రహారానికి చెందిన డిఫారం భూములలో జెసిబిలతో గ్రావెల్ను తవ్వి, టిప్పర్ల ద్వారా మాడుగుల మండలానికి తరలించడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆందోళన చెందిన గ్రామ ప్రజలు, స్థల రైతులు జెసిబి యజమానులను నిలదీయగా, చీడికాడ తహసిల్దార్ పర్మిషన్ ఇచ్చారని, మాడుగుల మండలంలో మట్టి రోడ్లను వేయడానికి తీసుకెళుతున్నట్లు చెప్పారని స్థానికులు అంటున్నారు. స్థానిక రైతుల భూముల్లోని గ్రావెల్ను పక్క మండలానికి తరలించడం, దానికి ఇక్కడి తహశీల్దార్ అనుమతులు ఇవ్వడం ఏంటనిప్రశ్నిస్తున్నారు. అందులోనూ భారీస్థాయిలో 400లోడుల గ్రావెల్ తరలింపునకు అనుమతులిచ్చే అధికారం తహశీల్దార్కు వుందా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ను తరలించాలంటే అది ఎవరి భూమి అని నిర్ధారించే వరకు రెవెన్యూ అధికారులకు అధికారముంటుందే తప్ప, అనుమతులిచ్చే అధికారం ఉండదనే పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భూమి ఎవరిదని రెవెన్యూ నిర్ధారిస్తే, గనులు భూగర్భ శాఖ (మైన్స్) అధికారులు ఎంతమేర తరలించాలో అనుమతులు ఇస్తారనే నిబంధన ఉంటుందే తప్ప, ఇక్కడ తహశీల్దార్ అనుమతితోనే గ్రావెల్ తరలిస్తున్నామని జెసిబి యజమానులు చెబుతుందడడంతో స్థానికుల అనుమానాలు మరింత ఎక్కువయ్యాయి. మండలంలోని బయలుపూడి గ్రామానికి చెందిన కొంతమంది డి పట్టా భూమిలో గ్రావెల్ను టిప్పర్ల ద్వారా మాడుగులకు దర్జాగా తరలింపుపై డిప్యూటీ తహసిల్దార్ను విలేకరులు ఫోన్లో ప్రస్తావించగా మంత్రి ఆదేశంతో ఆరు టిప్పర్లతో 400 లోడుల గ్రావెల్ తరలించేందుకు అనుమతులను తహసిల్దార్ ఇచ్చారని స్పష్టం చేశారు.

భూయజమానికి తెలియకుండా, అతనికి ఎటువంటి సొమ్ము చెల్లించకుండానే తహసిల్దార్ అనుమతులతో ఆరు టిప్పర్లతో సంబంధిత కాంట్రాక్టర్ 400లోడ్ల గ్రావెల్ను ఎలా తరలిస్తారని స్థానికులు అంటున్నారు. రెవెన్యూ అధికారులతో సర్వే జరిపించి సిఫార్సు నివేదికను మైన్స్ శాఖకు అందిస్తే వారు ఎన్ని క్యూబిక్ మీటర్లు గ్రావెల్ను తరలిస్తారో అంచనా వేస్తే, దానికి అవసరమైన రుసుమును చలానా రూపంలో ప్రభుత్వానికి జమ చేసిన అనంతరం గ్రావెల్ తరలించే వ్యక్తికి అనుమతిని ఇస్తారు. గ్రావెల్ తరలించేది ఎక్కడ నుండి ఎక్కడికి, ఎంత దూరం ఎన్ని టిప్పర్లు లేదా ట్రాక్టర్లుతో తరలిస్తారో వాటి నెంబర్లతో సహా అనుమతి ఇవ్వాల్సి ఉంది. కానీ వీటన్నింటినీ గాలికొదిలేసి, అడ్డగోలుగా తహశీల్దార్ అనుమతులున్నాయని భారీస్థాయిలో ఇతర మండలాలకు గ్రావెల్, మట్టిని తరలించడం వెనుకనున్న వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ, మైనింగ్ సెస్ను, భూయజమానికి పరిహారం ఇవ్వకుండా సాగుతున్న గ్రావెల్ దందాపై చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

ప్రజల పత్రిక 'ప్రజాశక్తి'

-కేలండర్ ఆవిష్కరణలో ఎంపిపి, ఎంపిడిఒ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిపి, తదితరులు

ప్రజాశక్తి - రావికమతం: నిజాన్ని నిర్భయంగా రాసే ప్రజల పత్రిక ప్రజాశక్తి అని ఎంపిపి పైలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాశక్తి 2024 కేలండర్ను ఎంపిపి పైలా రాజు, వైసిపి మండల అధ్యక్షులు ముక్కా మహలక్ష్మినాయుడు, ఎంపిడిఒ వెంకన్న బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి పైలా రాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వాస్తవాలు ప్రచురించే పత్రికల్లో ప్రజాశక్తి ముందుంటుందన్నారు. వాస్తవాలను నిర్భయంగా రాయలేక, పక్షపాతధోరణిలో నేడు అనేక పత్రికలు ఉంటున్న పరిస్థితుల్లో ప్రజాశక్తి పత్రిక ధైర్యంగా. ఉన్నది ఉన్నట్టు ప్రచురించడం ఆనందదాయకమన్నారు, ఎంపిడిఒవెంకన్నబాబు మాట్లాడుతూ వాస్తవాలను, నిజాలను ధైర్యంగా ఎదుర్కొని రాయడం ఆషామాషీ కాదని, అయితే అటువంటి పత్రికలకు ఎపుడూ సమాజంలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా పనిచేయడం, పేదల పక్షాన నిలిచిన పత్రిక ప్రజాశక్తి అన్నారు. కార్యక్రమంలో కొత్తకోట ఎంపిటిసి పూడి దేవ , చోడవరం మార్కెట్ కమిటీ వైస్చైర్మన్ రాజాన నరసింహులు, వైసిపి నాయకులు ధనాజీ, గోపి, వరహాలు, మండల పరిషత్తు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మె విజయంపై హర్షం

మద్దతు ఇచ్చిన వారికి ధన్యవాదాలు : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు ఇచ్చిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు తెలిపారు. గురువారం కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ బుధవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల కమిటీలో జరిగిన చర్చలు సఫలం కావడంతో మున్సిపల్ కార్మికులు సమ్మె విరమించి, విధుల్లో చేరారన్నారు. నర్సీపట్నంలో 15రోజుల పాటు సమ్మెకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొర్రా శ్రీనివాసరావు, కుపరాల రాజు, లోవరాజు, దేముడు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని జనసేన నూతన మండలాల అధ్యక్షులకు పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు నర్సీపట్నం రూరల్ అధ్యక్షులుగా మోపాడ చిరంజీవి, గొలుగొండ మండల అధ్యక్షులుగా గండెం దొరబాబు, నాతవరం మండల అధ్యక్షులుగా వెలగల వెంకటరమణ, మాకవరపాలెం మండల అధ్యక్షులుగా సేనాపతి శేషులను ప్రకటించిన నేపథ్యంలో గురువారం వీరిని శాలువతో సత్కరించారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ నూతనంగా నియమితులైన అధ్యక్షులందరూ పార్టీ సిద్దాంతాలు, పవన్ కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండాలని, ప్రజా సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు అండగా నిలవాలన్నారు.కార్యక్రమంలో నాయకులు వాసం వెంకటేష్, మాకిరెడ్డి వెంకటరమణ, వేగివెట్టి శ్రీను, బోయిన చిరంజీవి, ఠాగూర్, ప్రసాద్, కృష్ణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పలువురు బాధితులకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ గురువారం ఆర్థిక సాయం అందజేశారు. నాతవరం మండలం చమ్మచింత గ్రామానికి చెందిన ఎందుర్తి అమ్మన్న అనారోగ్యంతో చనిపోగా, వారి కుటుంబానికి మంజూరైన సిఎం సహాయనిధి సాయం రూ. 3లక్షలు, హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పెదబొడ్డేపల్లికి చెందిన సురవరపు మంగాదేవికి రూ. 2లక్షలు, సుబ్బారాయుడుపాలెంకు చెందిన తమరాన సంధ్యకు రూ.52వేలు మొత్తంగా ముగ్గురు లబ్ధిదారులకు రూ.5.52లక్షల చెక్కులను క్యాంపు కార్యాలయంలో అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మున్సిపాలిటీ వైసిపి అధ్యక్షులు ఏకా శివ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'



రావికమతంలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతలు

ప్రజాశక్తి - రావికమతం : మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, తహశీల్దారు ఎస్.ఎ.మహేశ్వరరావు ప్రారంభించారు. గురువారం స్థానిక జెడ్పి హైస్కూల్లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలలో 12 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి, మానసిక ప్రశాంతతకు దోహదపడే క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలతోపాటు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఆలోచన అభినందనీయమని కొనియాడారు. మేడివాడ, మరుపాక, రావికమతం, తోటకూరపాలెం, టిఆర్జాపురం, గుద్దిప కొత్తకోట-2, గుడివాడ, కొత్తకోట-3, బెన్నవరం, దొండపూడి, కన్నంపేట జట్లు పోటీలలో పాల్గొన్నాయి.వీరిలో మేడివాడ, రావికమతం, గుడ్డిప, కొత్తకోట 2, కొత్తకోట 3, దొండపూడి జట్లు విజేతగా నిలిచాయని నియోజకవర్గ ఇన్ఛార్జి కన్నం నాయుడు తెలిపారు. క్రికెట్ పోటీలు ఈనెల 12 వరకు కొనసాగుతాంయని, ఫైనల్లో గెలుపొందిన జట్టు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక అవుతుందన్నారు.కార్యక్రమంలో మండల ఇన్చార్జి లక్ష్మణరావు, కెవి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు

అచ్యుతాపురం : అచ్చుతాపురం మండల కేంద్రంలో గురువారం ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి ఆటల పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలు అచ్చుతాపురం గ్రామ సర్పంచ్ కె విమలా నాయుడు, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపిపి కోన సంధ్య బుజ్జి, ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించారు.కబడ్డీ, ఖోఖో, షటిల్ కాక్, వాలీబాల్ తదితర పోటీలు గురువారం జరిగాయి. వాలీబాల్ విన్నర్గా మడుతూరు, రన్నర్గా తంతడి టీములు నిలిచాయి. ఈ కార్యక్రమంలో గండిబోయిన వెంకట్, జె అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారాపై పోలీసుల దాడులు

-భారీగా బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో నీలిగుంట గ్రామంలో కన్నంరెడ్డి నాని బాబు, కన్నంరెడ్డి శ్రీను అనే వ్యక్తులు నాటుసారా తయారీకి పులుపును సిద్ధం చేసి ఉంచగా పోలీసులు దాడి చేసి పట్టుకుని, పులుపును ధ్వంసం చేశారు. అలాగే బోడపాలెం శివారు కొత్తూరు గ్రామంలో రాళ్లతల్లి అనే మహిళ సారా అమ్ముతోందని సమాచారం అందడంతో ఆమె వద్ద నుంచి రెండు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకొని ఇరువురు పైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు స్థానిక ఎస్ఐ రమణయ్య తెలిపారు.

ఆరు వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం.

కొత్తకోట : నాటుసారా తయారు చేస్తున్న స్తావరాలపై గురువారం కొత్తకోట పోలీసులు దాడులు నిర్వహించారు. రావికమతం మండలం పి. పొన్నవోలు శివారు కుముందానిపేట, గదబపాలెం,కొత్తూరు గ్రామాల్లో నాటు సారా తయారు చేస్తున్నట్లు సమాచారంతో కొత్తకోట సీఐ ఎల్. అప్పలనాయుడు, యస్ ఐ లక్ష్మణరావు సిబ్బందితో వెళ్ళి దాడులు నిర్వహించగా 22 డ్రమ్ములతో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుపును గుర్తించి ధ్వంసం చేశారు.అలాగే సారా తయారీకి ఉపయోగించే తొమ్మిది జాడీలను ధ్వంసం చేసారు.

800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

గొలుగొండ : మండలంలోని పాత కేడిపేట గ్రామ శివారులో కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో నాటుసారా తయారీకి ఉపయోగించి 800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి-మాకవరపాలెం : మండలంలోని భీమబోయినపాలెం, తామరంలో చెరో రూ.10 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్లను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి విలేజ్ క్లినిక్లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు రుత్తల వాసు, నాయకులు హరిబాబు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

31వ రోజుకు అంగన్వాడీల సమ్మె

వినూత్న నిరసనలతో ఆందోళన ఉధృతం ... ప్రజాసంఘాల సంఘీభావం



నర్సీపట్నంలో సిఐటియు ఆకారంలో అంగన్వాడీలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు కన్వీనర్ టి.ఈశ్వరరావు డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె గురువారం 31వ రోజున అంగన్వాడీలంతా సిఐటియు ఆకారంలో కూర్చొని వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలపై ప్రభుత్వం మొండివైఖరి వీడి, తక్షణమే వీరి డిమాండ్లు పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నర్సీపట్నం ప్రాజెక్టు వి.సామ్రాజ్యం, డి.మహాలక్ష్మి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడివినూత్న నిరసన

నక్కపల్లి : మండల పరిషత్ కార్యాలయ సమీపంలో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఒంటి కాలుపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించ, ఎస్మా ప్రయోగించి, నోటీసులిచ్చి ఒంటెద్దు పోకడలతో భయ పెట్టాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, నాయకులు కవిత, లక్ష్మీ రాజ్యం, మంగ లక్ష్మీ , రమణమ్మ, జయ, ఆర్‌వి కె లక్ష్మీ పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక మండలకాంప్లెక్స్‌లో గురువారం 31వ రోజున అంగన్వాడీలు సమ్మెదీక్షను కొనసాగించారు. సిఐటియు, జిల్లా రైతు సంఘ నాయకులు ఎం అప్పలరాజు సంఘీభావం తెలిపి, శిబిరంలో పాల్గొన్నారు, ఎస్మా ప్రయోగం, నోటీసులంటూ బెదిరింపులకు స్వస్తి చెప్పి, ఇచ్చిన హామీ మేరకు డిమాండ్లు నెరవేర్చి ప్రభుత్వం సమ్మె విరమణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల పట్ల మొండివైఖరి, ప్రభుత్వానికి చేటు తెస్తుందని హెచ్చరించారు. సిఐటియు నాయకులు బత్తిన నాగేశ్వరరావు, అంగన్వాడి యూనియన్ నాయకులు సత్యవేణి, నూకరత్నం అంగన్వాడీలు పాల్గొన్నారు

గొలుగొండ : అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. గొలుగొండ మండలంలో 31వ రోజు కొనసాగుతున్న అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.కార్యక్రమంలో గొలుగొండ ప్రాజెక్టు నాయకులు ఎం.మంగతాయారు, సిహెచ్.భ్రమరాంబ, సత్యవేణి పాల్గొన్నారు.

ఆనందపురం : సమ్మెలో భాగంగా ఆనందపురం కూడలి వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. ఈ శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు సందర్శించి మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేదన్నారు.



పెందుర్తిలో అంగన్వాడీలకు సంఘీభావంగా గంగారావు

అంగన్‌వాడీల దీక్షలను ఎపిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘం నాయకులు వెంకటరమణ, జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి, రవ్వ నర్సింగరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి, జనసేన నాయకులు తమ్మిన అప్పలరాజు, బివి.కృష్ణయ్య, శేఖరి శ్రీను, నరసింహనాయుడు, సంతోషనాయుడు, పిల్లా శ్రీను, బాలు, ప్రశాంత్ నాయుడు తాడివాడి కృష్ణ పాల్గొన్నారు.



నక్కపల్లిలో మోకాళ్లపై నిలుచుని నినాదాలు చేస్తూ నిరసన



రాంబిల్లిలో 31 ఆకారంలో అంగన్వాడీలు

పెందుర్తి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరాన్ని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు నాయకులు శంకరరావు, జగన్నాథం స్వామి సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి, సృజన, ఝాన్సీ భవానీ, సంతోషి, రాజేశ్వరి, ధన పాల్గొన్నారు.

పరవాడ : అంగన్వాడీ వర్కర్ల పోరాటం 31వ రోజుకి చేరుకుంది. గురువారం తాసిల్దార్ కార్యాలయం వద్ద దీక్ష శిబిరంలో అంగన్వాడీలు చెవుల్లో పువ్వులు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఽ యూనియన్ నాయకులు అక్కమ్మ, ఎం రమణి, సిహెచ్ దేవి, ఈశ్వరమ్మ, సత్య, ఉమా పాల్గొన్నారు.

మునగపాక : మండల కేంద్రంలోని అంగన్వాడీ దీక్షా శిబిరంలో గురువారం అంగన్వాడీలు ఒంటి కాలిపై నిలుచొని నిరసనను తెలియజేశారు. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని, తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు రామలక్ష్మి, జయలక్ష్మి, అంజలి, హేమలత, సరస్వతి, గంగాభవాని, బొడ్డేడ రేవతి పద్మ, సత్యవతి, బేబీ పాల్గొన్నారు.

సబ్బవరం : మండల కేంద్రంలోని దీక్షా శిబిరంలో అంగన్వాడీలు గురువారం ఒంటి కాలితో నిలబడి నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వివి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, డి.పుష్ప, ఎస్.జగదీశ్వరి, ఆర్.శివరామలక్ష్మీ, వి. సుభాషిణి, ఎం. కనకమ్మ, జి. అరుణ కుమారి,ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీలు గురువారం మోకాళ్లపై నిలుచుని జగనన్నకు దండం పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడు నాయుడు, యూనియన్ నాయకులు, మంగ, సుజాత, నూక రత్నం, లక్ష్మి, సంతోషి, అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం అంగన్వాడీ కార్యకర్తలు నేలపై సాష్టాంగ నమస్కారం చేస్తే ఆందోళన చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి జయలక్ష్మి వరలక్ష్మి రామలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట : సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా 31 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే, వారిపై చిన్నచూపు తగదని రోలుగుంట మండల సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి విమర్శించారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా, వారిపై ఎస్మా ప్రయోగించడం, అంగన్వాడీ కేంద్రాలకు నోటీసులు అంటించి బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. నోటీసులతో అంగన్వాడీలను భయపెట్టకుండా, ఎన్నికల సమయంలో, పాదయాత్రలో ఇచ్చిన హామీలను గుర్తుకు తెచ్చుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



అచ్యుతాపురంలో పొర్లు దండాలు పెడుతూ అంగన్వాడీల నిరసన

కనికరం లేని ముఖ్యమంత్రి జగన్

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాఖ కలెక్టరేట్ : ప్రజల పట్ల, మహిళల పట్ల ఏమాత్రమూ కనికరం లేని ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌కు ఉండడం రాష్ట్ర ప్రజలందరి దురదృష్టమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులకుపైగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చకపోవడం దారుణమన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ సర్కారును అంగన్‌వాడీలు, ప్రజలు పెకిలించనున్నారని తెలిపారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని రాజకీయాలు చేయడం తప్ప ఆయనకు పరిపాలన చేతకాదని విమర్శించారు. అంగన్‌వాడీలకు మద్దతు తెలిపిన వారిలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమల ఉన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న సిపిఐ రామకృష్ణ

అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

అనకాపల్లి : అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించి, సమ్మె విరమింపజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆరు రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని గురువారం లోకనాథం సందర్శించి మాట్లాడారు. అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాను తక్షణమే రద్దు చేయాలని, జీతాలను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న అబద్దాలకు అంతు లేకుండా పోయిందన్నారు. ఎస్మా ప్రయోగించినా కార్మికులు పట్టువీడటం లేదంటే వారి బాధ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలని హితవుపలికారు. అంగన్‌వాడీలు అత్యవసర విభాగం అని భావిస్తే ఇన్ని రోజులు ఎందుకు సమస్యను పరిష్కరించలేదని ప్రశ్నించారు. సంక్రాంతిలోపు సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె కుమారి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, ప్రసాదు, పాంగి చలపతి, కె.కోటపాడు ప్రాజెక్టు అంగన్వాడీలు ఎం జయలక్ష్మి పి.అప్పలకొండ, వి సుబ్బలక్ష్మి, ఎం లక్ష్మీకాంతం, ఆర్.నాగమణి, బి.వెంకటలక్ష్మి, డి.నాగమణి, బి.అమ్మాజీ, పి.భవాని, టి.శ్యామల, నూకరత్నం బి.ఉమామహేశ్వరి, సంతోషి, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, దేవుడమ్మ, మంగ, చిన్నారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం